మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



3లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 163 | శనివారం | 06 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## రక్షణ రంగాల్లో కొత్త అవకాశాలు



**- తదుపరి తరపు జీఎస్టీ సంస్కరణలు 'వికసిత భారత్' లక్ష్యానికి దోహదం చేస్తున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్య**

మన గళం, న్యూఢిల్లీ : దేశంలో జీఎస్టీ వ్యవస్థకు సంబంధించి తదుపరి తరపు సంస్కరణలను అమలు చేయడం, అనుసరణ అవసరాలను తగ్గించడం వల్ల వ్యాపార వాతావరణం మరింత అనుకూలంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వ్యాపారాలు నిర్వహించడంలో సరళత పెరగడం, పారిశ్రామిక వృద్ధికి ఆస్కారం పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ విధానాలు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయని 2 లో..



## పర్యవేక్షణను పెంచిన కేంద్ర ప్రభుత్వం

**- కంట్రోల్ రూమ్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా సమీక్షించిన మంత్రి రామ్ మోహన్ నాయుడు**

మన గళం, న్యూఢిల్లీ : ఇండిగో విమానాల రద్దు, ఆలస్యాల కారణంగా దేశవ్యాప్తంగా ఏర్పడిన అసాధారణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోంది. కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు ఆదేశాల మేరకు మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కీలక భూమిక నిర్వహిస్తోంది. ప్రయాణికులపై ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు వేగవంతం 2 లో..

## ఇండిగో వైఫల్యానికి ప్రభుత్వమే కారణం




- విమాన రద్దులతో దేశవ్యాప్తంగా గందరగోళం
- జాప్యాల ఖర్చు సాధారణ పౌరులపై భారం
- న్యాయ పోటీ అవసరమని ప్రతిపక్ష డిమాండ్

మన గళం, న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగోలో కొనసాగుతున్న సంక్షోభంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. నిర్వహణపరమైన లోపాల కారణంగా గత మూడు రోజులుగా వందలాది విమానాలు రద్దవ్వడం, వేలాది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఆయన ఆందోళనగా పేర్కొన్నారు. నేడు కూడా 400కిపైగా విమానాలు రద్దవ్వడంతో విమానయాన రంగంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ 2 లో..



# విద్యా వ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ☐ విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుపై దృష్టి
- ☐ తల్లిదండ్రుల పాత్ర, బాధ్యతలపై సందేశం
- ☐ విద్యా సంస్కరణలతో ముందుకు ప్రభుత్వం
- ☐ మంత్రి లోకేశ్

మన గళం, పార్వతీపురం మన్యం : ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థను దేశంలోనే ప్రథమ స్థానానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. బామినిలో నిర్వహించిన పేరెంట్-టీచర్ సమావేశంలో పాల్గొన్న ఆయన, విద్యార్థుల్లో నైతిక విలువలు, బాధ్యతాభావం పెంపొందించడం విద్యా వ్యవస్థకు అత్యవసరమని అన్నారు. పిల్లలంటే తనకు అపారమైన మమకారం ఉన్నందునే ముఖ్యమంత్రిని కోరుకుని విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, తల్లి ప్రేమ, తండ్రి త్యాగం గురించి మాట్లాడుతూ, "పిల్లలు తమ తల్లిదండ్రుల కష్టం, త్యాగాలను మరవకూడదు. తల్లికి చెప్పలేని పని ఎప్పుడూ చేయొద్దు" అని విద్యార్థులకు సూచించారు. మహిళల గౌరవం, సమానత్వంపై స్పందిస్తూ, పాఠ్యపుస్తకాలలో మహిళలను ఇంటి పనులకు పరిమితం చేసే చిత్రాల్ని తగ్గించామని, విద్యలో లింగసమానత్వం పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం 2 లో..




## విద్యారంగానికి కూటమి సర్కార్ ప్రధాన్యం

**- ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర**







మనగళం, కర్నూలు కార్పొరేషన్ : విద్యారంగానికి కూటమి సర్కార్ అధిక ప్రధాన్యతనిస్తుందని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని గవర్నమెంట్ టౌన్ మోడల్ స్కూల్ లో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి (మెగా పేరెంట్ టీచర్ మీటింగ్) ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ.... ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లింద్రులకు విద్య ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఉన్నత విద్యనభ్యశించాలని, తల్లిదండ్రుల తపాటు గురువులు, పాఠశాలకు పేరుతేవాలని సూచించారు. విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యార్థులు సెల్ ఫోన్ లకు అతుక్కపోతున్నారని, అవసరం మేరకే సెల్ ఫోన్ లను ఉపయోగించాలని సూచించారు.

## హిడ్మా మృతి ఎన్‌కౌంటర్ కాదు



మన గళం డెస్క్ : మావోయిస్టు అగ్రనేత హిడ్మా మృతిపై సంచలన ఆరోపణలు బయటపడ్డాయి. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) కార్యదర్శి వికల్ప్ పేరుతో విడుదల చేసిన లేఖలో, హిడ్మా ఎన్‌కౌంటర్ కాదు, పక్కా ప్రణాళికతో చేసిన హత్య అని 2 లో..




## విద్యార్థులను దేశానికి పనికొచ్చే శక్తులుగా తీర్చిదిద్దాలి

మన గళం, చిలకలూరిపేట : దేశానికి పనికొచ్చే శక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం శిక్షణా వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శారదా జడ్పీ హైస్కూల్ లో నిర్వహించిన మెగా టీచర్స్ - పేరెంట్స్ మీటింగ్ లో మాట్లాడిన ఆయన, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో 2 లో..

## రాష్ట్రపతిని కలిసిన బైరెడ్డి శబరి దంపతులు



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డితో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. దేశ సేవలో కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాష్ట్రపతి సాదాసీదా వ్యక్తిత్వం, వినయంతో కూడిన మాటలు మాకు ఎంతో ప్రేరణ ఇచ్చాయని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు.

## పవన్‌పై చేసిన వ్యాఖ్యలపై స్పష్టత



మన గళం, ఉండవల్లి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నాయకుల కారణమని పవన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కోమటిరెడ్డి, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేకపోతే సినిమాలను తెలంగాణలో ఆడనివ్వమని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో పెద్ద 2 లో..

## రక్షణ రంగాల్లో కొత్త అవకాశాలు

పేర్కొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, రక్షణ మరియు అంతరిక్ష రంగాలను ప్రైవేట్ సంస్థలకు తెరవడం కొత్త అవకాశాలను సృష్టించిందని తెలిపారు. ఈ రంగాల్లో కొత్త స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, సాంకేతిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రపంచ పోటీతత్వంలో భారత్ తన స్థానం బలపరచుకోగలదని సూచించారు. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడకుండా, దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఈ నిర్ణయాలు కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా, పౌర అణుశక్తి రంగాన్ని కూడా ప్రైవేట్ రంగానికి తెరవడానికి సిద్ధమవుతున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఇది కేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాకుండా, ఆలోచనా విధానంలో జరుగుతున్న పెద్ద మార్పుకు ప్రతీక అని పేర్కొన్నారు. శక్తి రంగంలో ఆధునిక టెక్నాలజీ, పెట్టుబడులు, పరిశోధనలు పెరగడంతో దేశ ఆర్థిక శక్తి మరింత బలపడే అవకాశముందని వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణలన్నిటి వెనుక ఉన్న ఏకైక లక్ష్యం 'వికసిత భారత్' సాధన అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు మాత్రమే కాదు, ప్రజల ఆలోచనలో కూడా మార్పు అవసరమని, కొత్త భారత నిర్మాణం కోసం సమిష్టి కృషి అవసరమని చెప్పారు. వచ్చే దశాబ్దాలు అభివృద్ధి, ఆధునికీకరణ, ప్రపంచ నాయకత్వం లక్ష్యంగా దేశం ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## విద్యా వ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

తీసుకొస్తున్న మార్పులపై మాట్లాడుతూ, 906 పాఠశాలల్లో విద్యా సంస్కరణలు అమలు చేస్తున్నట్లు, ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత తీసుకువచ్చినట్లు తెలిపారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, ప్రగతి వివరాలు తల్లిదండ్రులకు అందుబాటులో ఉన్నాయని, ఈ విధానం విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపర్చడంలో ఉపయోగపడుతోందని చెప్పారు. ఆంధ్రకేసరి విద్యార్థి దశ, రచయిత కారా మాస్టరు సేవలను గుర్తు చేసిన లోకేశ్, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో పాఠశాల, ఇంటి వాతావరణం రెండూ సమానంగా కీలకమని పేర్కొన్నారు. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## పర్యవేక్షణను పెంచిన కేంద్ర ప్రభుత్వం

చేయాలని మంత్రి సూచించారు. మంత్రి రామ్ మోహన్ నాయుడు స్వయంగా కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, కార్యకలాపాల పురోగతిని సమీక్షించారు. విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకులు, ఏటీసీ వంటి సంస్థల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, ప్రయాణికులకు సమయానుకూల సమాచారం అందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యమైతే ప్రయాణికులు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, చర్యలు చురుకుగా తీసుకోవాలని అన్నారు. దేశంలోని వివిధ విమానాశ్రయాల నుంచి రియల్ టైమ్ అప్‌డేట్లు సేకరించి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా టర్మినల్స్‌లో నిలిచిపోయిన ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు, సమాచారం అందించేందుకు వనరుల వినియోగం పెంచుతున్నట్లు తెలిపింది. విమానాశ్రయ నిర్వాహకులు, ఎయిర్‌లైన్‌లు, ఏటీసీ నుంచి వచ్చిన డేటాను ఏకీకృతం చేసి, సంబంధిత సంస్థలకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొంది. ఇండిగో సహా అన్ని విమానయాన సంస్థలకు మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయబడుతున్నాయి. ప్రయాణికుల సమస్యలను తగ్గించడం, విమానాల సేవలను సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడం ముఖ్యమని సూచించింది. త్వరితగతి చర్యలు తీసుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా విమాన రవాణా వ్యవస్థ సాధారణ స్థితికి చేరేందుకు మంత్రిత్వ శాఖ చర్యలు కొనసాగుతున్నట్లు కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

## ఇండిగో వైఫల్యానికి ప్రభుత్వమే కారణం

పరిస్థితికి ప్రభుత్వపు గుత్తాధిపత్య నమూనా నే ప్రధాన కారణమని రాహుల్ గాంధీ ఆరోపించారు. విమానయాన రంగం సహా పలు రంగాల్లో పోటీని అణిచివేయడంతో సేవల నాణ్యత పడిపోతుందని, దాని మూల్యం జాప్యాలు, రద్దుల రూపంలో ప్రజలే చెల్లించాల్సి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో, "ఇండిగో వైఫల్యానికి ఈ ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం. ఎప్పటిలాగే నష్టం సాధారణ ప్రజలదే. ఇలాంటి పరిస్థితులు మరలా పునరావృతం కాకుండా న్యాయమైన పోటీ ఉండాలి. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదు" అని రాశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలు విమానయాన రంగ నియంత్రణ, విధానాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టిని ప్రశ్నిస్తున్నాయి. ప్రయాణికుల సమస్యలు, రద్దైన విమానాల వల్ల ఏర్పడిన భౌతిక, ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఈ పరిస్థితిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం గమనార్హం. ఇండిగో సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు ఆదేశించడం, రీఫండ్ మరియు వసతి ఏర్పాట్లను సంస్థ అమలు చేయాలని సూచించడం జరిగింది. అయితే, వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేయకుండా సమస్యలు మళ్లీ మళ్లీ పునరావృతం అవుతాయని ప్రతిపక్ష నాయకులు స్పష్టం చేస్తున్నారు.

## హిడ్మా మృతి ఎన్‌కౌంటర్ కాదు

మావోయిస్టులు ఆరోపించారు. ఈ విషయంలో అధికార యంత్రాంగం ప్రచారం చేస్తున్న కథనం వాస్తవానికి పూర్తిగా విరుద్ధమని వారు పేర్కొన్నారు. హిడ్మా ఆచూకీని దేవ్ జీ పోలీసులకు అందించారని వస్తున్న వార్తలను పార్టీ తీవ్రంగా ఖండించింది. "దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు. వారు లొంగిపోయేందుకు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. హిడ్మా సమాచారాన్ని పోలీసులు వారికి చెప్పారనేది పూర్తిగా అవాస్తవం" అని లేఖలో పేర్కొన్నారు. హిడ్మా పట్ల పోలీసులు చేసిన చర్యను న్యాయబద్ధంగా చూపించడానికి తప్పుడు కథనాన్ని తయారు చేశారని పార్టీ అభిప్రాయపడింది. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులు కారణమని, అందులో అడవి నుంచి బయటకు వచ్చిన కోసాల్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారిగా ఉన్నారని లేఖలో వివరించారు. అతనితో పాటు విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, ఒక కాంట్రాక్టర్ ఉన్నారని మావోయిస్టులు ఆరోపించారు. అక్టోబర్ 27న చికిత్స నిమిత్తం హిడ్మా ఆ వ్యాపారి ద్వారా విజయవాడకు వెళ్లాడని, ఈ సమాచారం పోలీసులకు చేరడంతోనే హిడ్మాతో సహా 13 మందిని పట్టుకుని హత్య చేశారని తెలిపారు. ఈ ఘటనను కప్పిపుచ్చుకునేందుకు మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్ జరిగినట్టు తప్పుడు కథనం సృష్టించారని కమిటీ ఆరోపించింది. ఇది ఏపీ పోలీసుల ఆపరేషన్ మాత్రమే కాదని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ అని పేర్కొన్నారు. హిడ్మా మృతితో తమ ఉద్యమం ఆగిపోదని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది.

## పవన్‌పై చేసిన వ్యాఖ్యలపై స్పష్టత

స్థాయిలో వివాదం నెలకొంది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి, హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, పవన్‌పై చేసిన వ్యాఖ్యలు ఆ సమయంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగానే చేశానని చెప్పారు. "అది అప్పటి సందర్భం, ఇప్పుడు మేము కలిసి పనిచేయాలి" అని వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి స్నేహపూర్వకంగా ముందుకు సాగాలని కోరుకున్న ఆయన, అభివృద్ధి, పెట్టుబడులు, అవకాశాల విషయంలో సహకారం కీలకమని సూచించారు. రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ భేదాలు, విమర్శలు తాత్కాలికమేనని, కానీ ఉభయ రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు, కలిసి చేసే కార్యక్రమాలు స్థిరత్వం కోసం అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని చంద్రబాబు విజన్ 2020కి ప్రతిరూపంగా అభివృద్ధి చేశారని, ప్రస్తుతం అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా ఎదుగుతోందని కోమటిరెడ్డి ప్రసంసించారు. ఈ రెండు రాష్ట్రాలు పరస్పర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే, జాతీయ స్థాయిలో అభివృద్ధి, పెట్టుబడుల్లో శక్తివంతమైన కేంద్రాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## విద్యార్థులను దేశానికి పనికొచ్చే శక్తులుగా తీర్చిదిద్దాలి

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ వ్యవస్థ కలిసి పనిచేయాలని సూచించారు. విద్యారంగం

సమాజ నిర్మాణానికి పునాది అనేది అర్థం చేసుకున్న తరుణంలో, కుటుంబం మరియు పాఠశాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఆయన గుర్తుచేశారు.

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, కేరళ తరహా విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు అవసరమైన చొరవ చూపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ఐటి మరియు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ముందడుగు వేయడంతో ఈ సమావేశాలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నాణ్యమైన బోధనా పద్ధతులు, సమగ్ర విద్యా సదుపాయాలు, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. జెన్ జీ కాలంలో సృజనాత్మకత అన్ని రంగాల్లో అవసరమైన నైపుణ్యమని, విద్యార్థులు కొత్త ఆలోచనలు, విశ్లేషణ శక్తి, భావనాత్మక అభివృద్ధి దిశగా ప్రయాణించాలన్నారు. పుస్తకాలు చదవడం వ్యక్తిత్వాభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందని, పాఠశాలలు, గ్రామాల్లో గ్రూప్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని వారు సూచించారు. చదువు మార్కుల కోసం మాత్రమే కాకుండా జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఉండాలని ఆయన అభిలషించారు.

సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలు లేని సమాజం నిర్మించడానికి ప్రభుత్వంతో పాటు కుటుంబాలు,



విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు, సామాజిక బాధ్యతలను కాపాడేందుకు సమిష్టి కృషి అవసరమని ఆయన అన్నారు.

## తిరుమలలో డ్రోన్ కెమెరా కలకలం - భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు

**– మూడు అంచెల భద్రతను దాటుకుని కొండపైకి డ్రోన్ – విజిలెన్స్ అధికారులు హుటాహుటిన స్పందించి నిందితుల పట్టివేత**

మన గళం, తిరుమల : తిరుమలలో మరోసారి డ్రోన్ కెమెరా కలకలం రేపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న పవిత్ర కొండపైకి ఇద్దరు భక్తులు డ్రోన్ తీసుకురావడమే కాకుండా, దానిని యథేచ్ఛగా ఎగురవేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. టీటీడీ భద్రతా వ్యవస్థలోని లోపాలను ఈ ఘటన స్పష్టంగా బయటికితెచ్చిందని భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటన తిరుమల పవిత్రతతో పాటు, భద్రతను కాపాడడంలో ఉన్న లోటుపాట్లను మరోసారి గుర్తు చేసింది. ఘటన వివరాల ప్రకారం, అర్జున్ దాస్, సులక్షణ దాస్ అనే ఇద్దరు ఎన్నారై భక్తులు అలిపిరి వద్ద ఉండే మూడు అంచెల భద్రతా తనిఖీలను దాటుకుని డ్రోన్ కెమెరాను కొండపైకి తీసుకెళ్లారు. అనంతరం శిలాతోరణం సమీపంలో డ్రోన్‌ను గాల్లోకి ఎగురవేయగా, అది స్థానికులు మరియు ఇతర భక్తుల దృష్టికి పడింది. వెంటనే విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించి, ఘటనపై స్పందన ప్రారంభమైంది. భద్రతా వ్యవస్థ ఇంత సులభంగా దాటవేయబడటం గమనార్హమని పలువురు అభిప్రాయపడ్డారు. అలర్ట్ అయిన విజిలెన్స్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని, డ్రోన్‌ను ఎగరేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తులు ఇస్కాన్‌కు చెందిన ఎన్నారైలుగా గుర్తించిన అధికారులు, డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. అందులో రికార్డు చేసిన వీడియోలను పరిశీలించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. అనంతరం నిందితులను పోలీసులకు అప్పగించి, విచారణ కొనసాగుతోంది.

ఈ ఘటనలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా అధికారులు స్పందించడం ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఆగమశాస్త్రము ప్రకారం ఆలయంపై ఎలాంటి వస్తువులు, విమానాలు, పరికరాలు ఎగరడం నిషిద్ధం. భద్రతా పరంగా కూడా తిరుమలలో డ్రోన్లపై పూర్తిగా నిషేధం అమలులో ఉంది. అయినప్పటికీ గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం, భద్రతా వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. డ్రోన్లు, మొబైల్ ఫోన్లు ఆలయ పరిసరాలకు చేరడం తరచుగా



జరుగుతుండటం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా, కఠిన నిబంధనలు అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు.


## శ్రీవారి హుండీ వ్యాఖ్యలపై సోమిరెడ్డి మండిపాటు

మన గళం, తిరుమల : తిరుమల శ్రీవారి హుండీ గురించి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హిందువుల మనోభావాలను బాధించేలా వ్యాఖ్యలు చేయడం అనైతికమని, జగన్ బహిరంగ క్షమాపణ చెప్పి లెంపలు వేసుకోవాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన హుండీపై అలాంటి వ్యాఖ్యలు చేయడం ధార్మిక భావాలను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. శ్రీవారి పరకామణి చోరీ కేసుపై జగన్ చేసిన వ్యాఖ్యలను సోమిరెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. "పవిత్రమైన హుండీ అంటే అంత సాధారణమైనదా? హుండీలో చోరీ చేస్తే తప్పేంటన్నట్టు మాట్లాడటం ఎలాంటి బాధ్యతారాహిత్యం? మీ వ్యాఖ్యలను హిందూ సమాజం ఎప్పటికీ క్షమించదు" అని విమర్శించారు. పవిత్రతను కాపాడాల్సిన సందర్భంలో చేసిన వ్యాఖ్యలు నమ్మశక్యం కానివిగా పేర్కొన్నారు. సీఎంగా ఉన్నప్పుడు జగన్ శ్రీవారి ఆలయ వ్యవహారాల్లో అనేక తప్పిదాలు చేశారని, అవే ఎన్నికల్లో శాపాలుగా మారాయని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన అహంకారం, ధార్మిక వ్యవహారాల పట్ల నిర్లక్ష్యం వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితంట్కొందని విమర్శించారు. "జనం శ్రద్ధతో భక్తితో స్వామికి ఆభరణాలు సమర్పిస్తారు. కానీ మీరు శ్రీవారినే నిలువు దోపిడీ చేసిన వాళ్లలో ఒకరు" అని ఘాటుగా దుయ్యబట్టారు. "భగవంతుడి విషయంలో అహంకారంతో మాట్లాడిన నిన్ను ఏ దేవుడూ క్షమించడు. నువ్వు చేసిన పాపాలకు కన్ఫెషన్ బాక్సులో కూర్చున్నా జీసస్ కూడా అసహ్యించుకుంటారు" అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీలోని హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు కూడా ఇతర మతాలను కించపరచే వ్యాఖ్యలను సమర్థించరని, ధర్మం పేరుతో ద్వేష ప్రసంగం అంగీకారానికి కారణం కాదని ఆయన సూచించారు. మత సామరస్యాన్ని కాపాడటం రాజకీయ నాయకుల నైతిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

– చేతిపంపులు, రక్షిత నీటి పథకాలు మరమ్మతులు చేయించండి – సమ్మర్ స్టోరేజ్, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపాలి
– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకూడదని, అందుకనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఇరిగేషన్, హంద్రీనీవా ఎస్ ఈ లు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి అంశంపై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు సంబంధించి ఏమైనా మరమ్మతులు ఉంటే, ఇప్పుడే పూర్తి చేస్తే వేసవిలో నీటి సమస్య ఉండదని, ఆ మేరకు అధికారులందరూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేతి పంపులు, పైప్ లైన్ ల మరమ్మతులు, బోర్ల డీపెనింగ్, పవర్ సప్లై, తదితర నీటి పథకాల మరమ్మత్తులు ఏమైనా ఉంటే డిసెంబర్ 20 తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపాలని ఇరిగేషన్ ఎస్ ఈ ని ఆదేశించారు. గ్రామపంచాయతీలో నీటి పథకాలకు సంబంధించి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే పంచాయతీ నిధుల నుండి చేయించాలని డీపీఓ ను ఆదేశించారు. ఎక్కువ నిధులు అవసరమైన వాటికి, ఎస్టిమేట్స్ తో తనకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే కర్నూలు కార్పొరేషన్,ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో కూడా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో నీరు నింపడం, పైప్లైన్ లీకేజీలు, బోర్లు, ఇతర మరమ్మతుల పనులను చేయించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు, ఇతర నీటి సరఫరా కు సంబంధించిన మరమ్మతు లను డీపీఓతో సమన్వయం చేసుకుని, ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందుగానే జాగ్రత్త పడాలని గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈకి సూచించారు. గ్రామాల్లో నీటి పథకాల నిర్వహణను సక్రమంగా చేయాలని, ఒక ప్రాంతానికి ఎక్కువ, ఒక ప్రాంతానికి తక్కువ ఇవ్వకుండా, ఎంత నీరు అవసరమో, అంతే వదిలేలా క్రింది స్థాయి సిబ్బంది కి ఆదేశాలు జారీచేయాలన్నారు. అలాగే సుంకేసుల రిజర్వాయర్ మరమ్మత్తులు, దూదే కొండ



వద్ద హంద్రీ నీవా ప్రధాన కాలువ గట్టు మట్టి కోత గురించి కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ ఈ, హంద్రీ నీవా ఎస్ ఈ లతో ఆరా తీశారు. మరమ్మతుల పనులు త్వరితగతిన పూర్తి కావాలని, ఎక్కడైనా కొంత మొత్తంతో పూర్తి చేయగలమని అనుకుంటే, తగిన ప్రతిపాదనలు తనకు పంపాలని కలెక్టర్ ఎస్ ఈ లకు సూచించారు. సమస్య ఏర్పడినపుడు ఇలా చేసి ఉంటే బాగుండు అనే పరిస్థితి రాకూడదని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. టెలి కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి, హంద్రీనీవా ఎస్ ఈ పాండురంగయ్య, డీపీఓ భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ మనోహర్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

– విద్యతోనే గుర్తింపు, మంచి భవిష్యత్
– కష్టపడి చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి
– జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్





మనగళం, కర్నూలు సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య మంచి బంధం ఏర్పరిచేందుకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం రూ. 6 నుండి 8 వేల వరకు ఖర్చు చేస్తోందన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఐఎఎస్ స్థాయికి ఎదిగానని చెప్పారు. విద్య వల్ల గుర్తింపు, మంచి భవిష్యత్ లభిస్తుందన్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యం చేరేదాక కష్టపడి చదివితే, సాధ్యం కానిది ఏదీ లేదని జేసీ విద్యార్థినులను ప్రోత్సహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు బాగాచదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయకూడదని, ఆడపిల్లల్ని బాగా చదివించాలని జేసీ సూచించారు. తొలుత జేసీ పాఠశాల లో నీటి వసతి, టాయిలెట్ లు, వంట గది ని పరిశీలించారు. తరగతి గదులకు వెళ్ళి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులతో ముచ్చటించారు. ప్రోగ్రెస్ కార్డు లను పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర శేఖర్ వర్మ, ఎంపిడిఓ, హెడ్ మాస్టర్, విద్యా కమిటీ చైర్మన్ రాజేష్, మండల నాయకులు జ్ఞానేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి .అంజిబాబు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక కలెక్టర్ కార్యాలయము ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంజి బాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సేవకుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురు చూశారన్నారు. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రం వీఆర్ఏలకు పే స్కేలు ఇచ్చి ఆదుకొందని తెలియజేశారు. మన రాష్ట్రంలో కూడా గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు వెంటనే వీఆర్వో ప్రమోషన్లు ఇవ్వాలని, రికార్డ్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఏళ్ల తరబడి నామినేలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని కోరారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. రెవెన్యూ డిపార్ట్ లో ఖాళీలన్నిటిని



వీఆర్ఏల ద్వారా భర్తీ చేయాలని కోరారు. రీ సర్వే పేరుతో పక్క గ్రామాలకు డ్యూటీలను వేసి వీఆర్ఏలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిసర్వే సందర్భంగా చేసిన డ్యూటీలకు టీఏ.డీఏలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, జిల్లా నాయకులు భీమన్న, శాంతిరాజు, రంగన్న, మహేష్, సిద్దలింగ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు టూ బళ్లారి హైవే ఏర్పాటు చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు టూ బళ్ళారి హైవే ఏర్పాటు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్.హెచ్.ఏ.ఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో పాల్గొంటున్న ఎంపీ, ఢిల్లీలోని ఎన్.హెచ్.ఏ.ఐ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానించే కర్నూలు బళ్ళారి హైవే ఏర్పాటైతే వాణిజ్యం, పర్యాటకం, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. హైవే ఏర్పాటు పై చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ నాగరాజు తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తే ... రాష్ట్ర భవిష్యత్తు - కే.ఈ . శ్యామ్ కుమార్





మనగళం, పత్తికొండ టౌన్ నందు ూా=జీజ రెసిడెన్షియల్ స్కూల్ నందు మూడవ పేరెంట్స్ టీచర్ మీటింగ్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలోలి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గారు ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. అలాగే సాంబశివ రెడ్డి, ప్రమోద్ కుమార్ రెడ్డి, రామానాయుడు, ముత్యాల తిరుపాలు, చక్రాల రాజు,ఎద్దులదొడ్డి శ్రీను,విద్య కమిటీ చైర్మన్ , వైస్ చైర్మన్, టీచర్స్ మరియు విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ:–లిముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గారు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు గారు, విద్యార్థుల భవిష్యత్ కొరకు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి 15000/– అలాగే డొక్కా సీతమ్మా గారి పథకం ద్వారా పిల్లకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తూ, విదేశీ విద్య చదవడానికి ఆర్థిక సహాయం, ఉచిత యూనిఫామ్, పుస్తకాలు, బీసీ ఎస్ సి, ఎస్. టి హాస్టల్ నందు అన్ని సదుపాయాలు కల్పిస్తూ, ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించి నాణ్యమైన విద్య, నాణ్యమైన బలవర్ధక ఆహారం, పరిసరాలు పరిశుభ్రత అందించడం జరుగుతుంది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాల ద్వారా పరీక్షలు నిర్వహించడం, వాటిని తల్లిదండ్రులకు చూపించడం ద్వారా పిల్లల ప్రోగ్రెస్‌ను తెలియజేస్తారు. అలాగే పిల్లల సమగ్ర వికాసాన్ని తెలిపే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్‌కార్డులను కూడా తల్లిదండ్రులకు అందిస్తారు. పిల్లలు పరీక్షల్లో ఎలా రాశారు, వారికి ఎన్ని మార్కులు వచ్చాయి, చదువుల్లో వారి స్థాయి ఏమిటి వంటి విషయాలను తల్లిదండ్రులు నేరుగా తెలుసుకోవచ్చు. కొత్తగా ప్రవేశపెట్టిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో పిల్లల విద్యాభివృద్ధి, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగాల్లో వారి ప్రతిభ, ఆటల్లో రాణించడం వంటి అనేక అంశాలను నమోదు చేస్తారు. ఇది పిల్లల సమగ్ర వికాసాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా, విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్‌కార్డులను కూడా ఈ సమావేశంలో తల్లిదండ్రులకు అందజేస్తారు అని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే స్కూల్ కు ఏమి అవసరమొచ్చిన తనను సంప్రదించ వలసినది గా అని అన్నారు. ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ ఈ స్కూల్ నందు నీటి వసతి కొరత ఉన్నది అని తమరికి తెలిపిన వెంటనే కేవలం 4 రోజుల లోనే బోరు వేయించి నీటి కొరత తీర్చినందుకు ఎమ్మెల్యే గారికి ధన్యవాదాలు తెలుపడం అయినది. అలాగే స్కూల్ నందు ఎఏ కెమెరాలు ను మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ ప్రమోద్ కుమార్ రెడ్డి గారు తన వంతు గా ఏర్పాటు చేయిస్తాను అని చెప్పారు.

# మీ డబ్బుమీ హక్కు పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి "మీ డబ్బుమీ హక్కు" పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మీ డబ్బు మీ హక్కు" కార్యక్రమం ప్రతి పౌరుడికి తమ హక్కులను తిరిగి అందించడానికి ప్రభుత్వం చేపట్టిన అత్యంత కీలకమైన ప్రజా ప్రయోజన చర్య అన్నారు. సరైన ధృవపత్రాలు సమర్పించి బ్యాంకుల్లో నిరుపయోగంగా ఉన్న అన్ క్లైమ్డ్ అకౌంట్స్ లోని మొత్తాన్ని రిజర్వు బ్యాంక్ నుంచి తిరిగి పొందవచ్చన్నారు. బ్యాంకు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ హక్కు అయిన డబ్బును తిరిగి పొందాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు మట్లాడుతూ సెప్టెంబర్ 30, 2025 నాటికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 1,20,46,304 ఖాతాల్లో రూ. 2,197.83 కోట్లు అన్ క్లైమ్డ్ అమౌంట్ రిజర్వ్ బ్యాంకు వద్ద నిల్వవుంచబడినట్టు తెలియజేశారు. అందులో కర్నూలు జిల్లాకే సంబంధించి 3,76,182 ఖాతాల్లో రూ. 85.53 కోట్లు అన్ క్లైమ్డ్ అమౌంట్ రూపంలో రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్ర రావు వెల్లడించారు. కార్యక్రమంలో డీ ఆర్ వో వెంకటనారాయణమ్మ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా అధికారి పాండే, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ జిల్లా అధికారి జాబియుల్లా ఖాన్, కెనరా బ్యాంక్ జిల్లా అధికారి సురేష్, కోఆపరేటివ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ సంధ్య , గ్రీష్మ , సీఎఫ్ఎల్ కౌన్సిలర్ నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు వేగవంతం

– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్





మనగళం, కర్నూలు సిటీ: నగరంలోని గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు పనులు వేగవంతం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన కుదింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోందని, వీలైనంత వేగంగా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే రహదారుల విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి వద్ద కూడలి వెడల్పు ఉండటం కారణంగా వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూడలిని కుదింపు చేస్తున్నామని పేర్కొన్నారు. రాజ్ విహార్ వైపు 15 అడుగులు, సి.క్యాంపు వెళ్ళే వైపు 9 అడుగులు తొలగిస్తున్నామని, రూ.28 లక్షలతో చేపడుతున్న ఈ పనులు మూడు వారాల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ పవన్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రాష్ట్రస్థాయి పురుషుల సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలు కర్నూల్ అవుట్డోర్ స్టేడియం మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో పి. విజయకుమార్, జిల్లా ఒలంపిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సునీల్ కుమార్, డీఎస్ డీవో భూపతి రావు, హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి తదితరులు ప్రారంభించారు. పి విజయకుమార్ మాట్లాడుతూ హ్యాండ్ బాల్ ఒక చక్కటి క్రీడ అని, 40 సంవత్సరాలుగా కర్నూలు జిల్లా ప్రతినిత్యం ఆదిత్యమిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. హ్యాండ్ బాల్ కు అనేక మంది పీటీలు, క్రీడా సంఘాల ప్రతినిధులు పోటీపడి నిర్వహణ లో భాగమైనారన్నారు. జిల్లాలో రాష్ట్ర, జాతి, అంతర్జాతీయ, స్థాయిలో క్రీడాకారులను నిలబెట్టిన ఘనత కర్నూలుకు దక్కిందన్నారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడకారులు పాల్గొన్నారాని, రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉచిత భోజన వసతులు జిల్లా హాండ్ బాల్ సంఘం కల్పిస్తుందని జిల్లా సంఘం కార్యదర్శి రుద్రా రెడ్డి తెలిపారు. ఈ పోటీలో ముగింపులో గలుపొందిన వారికి ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ ను బహుకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర్ నాయుదు, హ్యాండ్ బాల్ గోపి , సీనియర్ ప్రేయర్లు వెంకటేష్, వెంకటేష్, శివ, కృష్ణ, నరేష్, దుర్గ, షాహినా, కోచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి మద్దతు ఇవ్వండి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రభుత్వ మెడికల్ కళశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని వైసీపీ స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా 50వ వార్డులో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ ఎస్.టి. షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆమె ఇంటింటికి వెళ్లి కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించారు. విద్య, వైద్యం, విద్యార్థుల భవిష్యత్తు రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ కోటి సంతకాల ఉద్యమంలో ప్రతిఒక్కరూ పాల్గొని మద్దతు తెలుపాలని ఈ సందర్భంగా ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : విశాఖలో డిసెంబరు 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే అఖిలభారతసీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ న్యూ సిటీ ఆల్ ట్రేడ్ యూనియన్స్ విస్తృతస్థాయి సమావేశము కార్మిక కర్షక భవన్ లో నిర్వహించారు. సీఐటీయూ న్యూ సిటీ అధ్యక్షులు వై నగేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు, జిల్లా నాయకులు టి రాముడు, కోశాధికారి సీహెచ్ సాయి బాబా మాట్లాడారు. మహాసభల్లో ఉద్యోగ కార్మికుల సమస్యల పై ఐదు రోజులపాటు చర్చించి రాబోయే మూడు సంవత్సరాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం కోసం ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సమావేశంలో సీఐటీయూ నగర నాయకులు కే సుధాకరప్ప, ఎస్ఎండి మహమ్మద్ రఫీ, బి రాధాకృష్ణ, కే ప్రభాకర్, జి ఏసు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎం




వెంకటేశ్వర్లు, కే రామకృష్ణ, బీసన్న, మౌలాలి, వెంకటస్వామి, గోవిందు, సంజీవ, రాజు, రెహ్మాన్, జలాలుద్దీన్, లక్ష్మీనారాయణ, ఐ రాజు, కోటీశ్వర్, మోహన్, రామచంద్రుడు, మిన్నల్లా, దేవరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : ఎన్నికల ముందు యువతకు కూటమి పెద్దలు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అందించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి సర్కార్ మాయమాటలతో మభ్యపెడుతోందని, యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతి విషయంలో ప్రకటనలు, ప్రచారాలు, సభలు, పెద్ద పెద్ద మాటలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కూటమి పెద్దలు ప్రచార ఆర్భాటంతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిని అమలు చేయాలని, లేని పక్షంలో యువత తరుపున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్, హనోక్, రాజేశ్వరి, మహేంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్ద పీట

- ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రుల మధ్య సుస్థిర సమన్వయానికి మెగా పీటీఎం
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి






మనగళం, కర్నూలు సిటీ : విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రుల మధ్య సుస్థిర సమన్వయం కోసం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను కలెక్టర్ తిలకించి, అభినందించారు.సేంద్రీయ వ్యవసాయం, రిచ్ విటమిన్ గార్డెన్, పునరుత్పాదక ఇంధన పార్క్, వాక్యూమ్ క్లీనర్ తదితర సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ లను పరిశీలించారు. విద్యార్థులు వివరిస్తున్న తీరును కలెక్టర్ అభినందించారు. నిత్య జీవితంలో ఈ ప్రాజెక్టులను ఎలా ఉపయోగించాలి అని తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, బాల్య వివాహాల నివారణపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలను వీక్షించారు. అనంతరం సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నేను కూడా చదువు మీదే దృష్టి పెట్టి రోజుకు 14 గంటలు చదివి మెడిసిన్ (ఎంబీబీఎస్) సీటు సాధించాను. తర్వాత గ్రూప్1 పరీక్షల్లో విజయంతో ఈరోజు జిల్లా కలెక్టర్‌గా మీ ముందున్నాను. నాకు ఈ స్థాయి రావడానికి నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత, కష్టపడి చదివిన శ్రమ కారణం అని ఆమె విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. విద్యార్థులు ఎన్ని ఇబ్బందులు వచ్చినా చదువును విడిచిపెట్టకూడదని, ఏ సబ్జెక్టు పట్ల భయం ఉంటే అదే సబ్జెక్టులో ఎక్కువగా సాధన చేసి ఆ విషయంపై పట్టు సాధించాలని సూచించారు. భయపడే సబ్జెక్టును బలహీనతగా కాకుండా అవకాశం గా తీసుకుని, ఆ సబ్జెక్టులో మాస్టర్ గా కావడానికి సంకల్పించండి అని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పదవ తరగతి ఫలితాలు మెరుగుపరచడం లక్ష్యంగా రేపటి నుంచే 100 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఒక సబ్జెక్టుకు సంబంధించిన బోధన అనంతరం విద్యార్థులకు 20 మార్కుల పరీక్షలు నిర్వహించి సాయంత్రం 5 గంటలలోపు స్కాన్ చేసి జిల్లా కేంద్రానికి అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టినట్టు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అధికారులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పక్కనే భోజనం చేస్తున్న విద్యార్థిని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. అంతకుముందు జిల్లా విద్యా శాఖాధికారి, మండల విద్యా శాఖాధికారి, పాఠశాల హెడ్మాస్టర్ విద్యాభివృద్ధి, వంద రోజుల యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్ పాల్,స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ నాగమణి, మండల విద్యాశాఖాధికారి వనజ, తహసీల్దార్ ఆంజనేయులు, పాఠశాల చైర్మన్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## లక్షకుంకుమార్చన



మనగళం శ్రీశైలం :ఈ రోజు (04.12.2025) ఉదయానికి పౌర్ణమి ఘడియలు రావడంతో శ్రీ అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిపించబడుతోంది. ఈ లక్షకుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 19మంది భక్తులు పరోక్షసేవగా ఈ కుంకుమార్చనను జరిపించుకుంటున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు ఆస్ట్రేలియా దేశం నుంచి కూడా ఒక ప్రవాస భారతీయుడు ఈ పూజలను నిర్వహించుకుంటున్నారు. కాగా లక్షకుంకుమార్చనలో ముందుగా పూజాసంకల్పం పఠించబడుతుంది. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను నిర్వహించడం జరుగుతుంది. అనంతరం లక్షకుంకుమార్చన జరిపించబడుతుంది. కాగా మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ కుంకుమ ద్రవ్యముతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొంటున్నారు. ఈ లక్షకుంకుమార్చన జరిపించుకోవడం వలన కష్టాలు తొలగిపోతాయని, సర్వశుభాలు కలుగుతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని, సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని, సంసారం వృద్ధిలోకి వస్తుందని, సంతాన సౌఖ్యం కలుగుతుందని, పూర్వజన్మదోషాలు తొలగిపోతాయని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలను పరోక్షంగా జరిపించుకునేందుకువీలుగా దేవస్థానం ఈ ఆర్జితపరోక్షసేవను నిర్వహిస్తోంది. ఈ పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/–లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులుసేవారుసుమును .శితీస్త్ర లేదా ద్వారా చెల్లింపు చేయవచ్చు. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్రం ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 లను సంప్రదించవచ్చును.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కోడుమూరు మోడల్ స్కూల్లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేశారని తాసిల్దార్ నాగరాజ్ అన్నారు. ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో తల్లిదండ్రులకు పాటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ప్రిన్సిపల్ ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగింది. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాసిల్దార్ నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు కృషి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో నాయకుల అభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. విజయం సాధించేవరకు కృషి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులలో పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు ప్రభుత్వం అందిస్తున్న విద్య వనరులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. కోడుమూరు మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి తల్లిదండ్రుల ఆత్మీయ కలక ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యా ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. మండల కార్యదర్శి వెంకటగిరి రాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని చట్టాలపై అవగాహన పెంపొందించుకోలని విద్యార్థులను తల్లిదండ్రుల ప్రతిరోజు గమనిస్తూ ఉండాలని అన్నారు. మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఆమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంటు టీచర్ మీటింగు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం హెడ్ మాస్టర్ అనంతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిల్ల బంద భాష హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ అశోక్ కుమార్, రవీంద్ర గౌడ్, బలరాం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జి.వి.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తల్లిదండ్రుల సమావేశము





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణము నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మెగా పిటీఎం 3.0 తల్లిదండ్రుల సమావేశము జివిఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామచంద్రుడు కమిటీ చైర్మన్ శ్రీ ధర్మరాజు మరియు పేరెంటు కమిటీ సభ్యుల సమక్షంలో శుక్రవారం ఉదయం జి.వి.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడుమూరు నందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి కోడుమూరు మండల ఎంపీడీవో ఏసి రాముడు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులకు తమ అమూల్యమైన, విలువైన సందేశాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోడుమూరు టిడిపి టౌన్ ప్రెసిడెంట్ గంగాధర్ నాయుడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెడ్మాస్టర్ తైమూరు భాష జి.వి.ఆర్ ఉన్నత పాఠశాల కోఆప్టెడ్ మెంబర్స్ ఇంతియాజ్ నిహార్ పాల్గొని తమ అమూల్యమైన సలహాలు, సూచనలను విద్యార్థులకు అందించారు ఇందులో భాగంగా 1977-78 సంవత్సర పాఠశాల పూర్వ విద్యార్థులు హాజరై, తమ వంతు సహాయంగా పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు త

తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రాజరాజేశ్వరి, అనిత కుమారి, ఎల్లయ్య,కృష్ణమూర్తి, సోమశేఖర్, గౌరమ్మ , వీరుపాక్షమ్మ , ఆదాం షఫీ అల్లా, ఉస్మాన్ సాహెబ్,ఎల్లారెడ్డి, రత్నా నాయక్,శ్రీనివాసరెడ్డి,ప్రసన్న జ్యోతి, అరుణ, షాహిదా, తదితరులు పాల్గొన్నారు

# తల్లిదండ్రులు, గురువులు మెచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

**– ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలి – పిల్లల్లో పోటీతత్వం, నైపుణ్యాలు పెంపొందేలా చర్యలు**

**– పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక బోధన ప్రణాళిక – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





మనగళం, చాగలమర్రి : విద్యార్థి దశ నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ పెంపొందించుకుంటే తల్లిదండ్రులు, గురువులు గర్వపడే స్థాయికి విద్యార్థులు ఎదగగలరని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం చాగలమర్రి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధతో మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సమావేశాల ద్వారా విద్యార్థుల విద్యా ప్రతిభ, క్రీడా నైపుణ్యాలు, ఉపాధ్యాయుల బోధనపై పిల్లలకు అర్థం అవుతున్న స్థాయిలను తల్లిదండ్రులకు విపులంగా వివరిస్తున్నామన్నారు. అదేవిధంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ ను తల్లిదండ్రులకు అందించి, విద్యార్థుల పురోగతిని సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది కాబట్టి రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 100 రోజుల ప్రత్యేక బోధనా ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. చదువులో కొంత వెనుకబడిన విద్యార్థులను రైజింగ్ స్టార్స్ గా గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. అదనంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, క్రీడలు ఇతర నైపుణ్య కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఏ విషయంలోనైనా ముందుండాలనే తపన విద్యార్థుల్లో ఉండాలన్నారు. పోటీతత్వంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. డొక్కా సీతమ్మ పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, అవసరమైతే తల్లిదండ్రుల సూచనల మేరకు మెనూలో మార్పులు కూడా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించేలా తల్లిదండ్రులు, గురువులు క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మాసం మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర స్వర్ణఆంధ్ర కార్యక్రమాల ద్వారా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో విఫలమైనా లేదా చదువు కొనసాగించడంలో ఇబ్బందులు వచ్చినా విద్యార్థినిలను బాల్య వివాహాల వైపు నెట్టకుండా, ఉన్నత విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. 18 సంవత్సరాల లోపు బాల్య వివాహాలు జరిగితే, అబ్బాయిఅమ్మాయి ఇద్దరి తల్లిదండ్రులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---

# డోన్ నందు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ లో చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి



మన గళండోన్ పట్టణంలో జెడ్.పి హైస్కూల్ నందు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ 3.0 తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి –లి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తన పరంగా ఏ స్థాయిలో ఉన్నారో, సమాజ అంశాలపై ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తల్లిదండ్రులు తెలుసుకునేందుకు విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో పరస్పరం తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అదేవిధంగా రానున్న 10వ తరగతి పరిక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు స్కూల్ మొదటి బహుమతి రూ.25,000/-, రెండవ బహుమతి రూ.15,000/-, మూడవ బహుమతి రూ.10,000/- అందజేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున పలువురు ముఖ్య నాయకులు,ఉన్నత అధికారుల, పేరెంట్స్ మరియు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జెడ్.పి హైస్కూల్ తరుపున జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించి విద్యార్థులకు సర్టిఫికెట్ లు అందజేశారు.లి

# బాలసదనమును సందర్శించిన కలెక్టర్



మనగళం, ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని బాలసదనంను (చిల్డ్రన్ హోమ్) నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సందర్శించారు. అక్కడ ఉన్న చంటి పిల్లలతో ప్రేమగా, ఆత్మీయతతో ముచ్చటించారు. చిన్నారుల శుభాకాంక్షలను స్వీకరించారు. అక్కడి పిల్లల సంక్షేమంపై వివరాలు తెలుసుకుని, అందిస్తున్న సదుపాయాలు, నివాసం, విద్య, పోషకాహారంపై అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం పిల్లలకు ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కృషి..మంత్రి బీసీ







మన గళం అవుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పీ టి ఎం 3.0 లో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హాజరు కావడం జరిగింది. మంత్రికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల యందు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది అందులో భాగంగానే మెగా పేరెంట్ 3.0 అని అన్నారు. విద్యా వ్యవస్థ పై బలాలు, బలహీనతలపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అవుకు మండల టిడిపి అధ్యక్షులు ఉగ్రసేనారెడ్డి , సీనియర్ నాయకులు చల్లా భాస్కర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమావేశం



మనగళం, కల్లూరు అర్బన్ : కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి, డీఈఓ సామెల్ పాల్, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి నాగముని, విద్యా కమిటీ చైర్మన్ బాషా తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను కలెక్టర్ తిలకించి, అభినందించారు. సేంద్రీయ వ్యవసాయం, రిచ్ విటమిన్ గార్డెన్, పునరుత్పాదక ఇంధన పార్క్, వాక్యూమ్ క్లీనర్ తదితర సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ లను పరిశీలించారు.

## పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్ కాశింవలి...

– ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు...







నందవరం డిసెంబర్ 5 మనగళం న్యూస్ నందవరం మండలంలోని మాచాపురం గ్రామం నందు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన స్కూల్ హెచ్ఎం మరియ టీడీపీ కన్వీనర్ కాసింవలి వారు మాట్లాడుతూ విద్యార్ధులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాల్లో మౌళిక వసతులు కొరత లేదని ఎన్నికల ముందు ఇచ్చిన తల్లికి వందనం హామీని నెరవేర్చి విద్యార్ధుల తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారని అన్నారు. విద్యార్ధుల తల్లిదండ్రులు పిల్లలను పనికి తీసుకువెళ్లకుండా బడికి పంపించి వారి భవిష్యత్తు బాగుపడేలా చూసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పడేసాబ్ పాఠశాల చైర్మన్ మునిస్వామి మరియు గ్రామ టిడిపి నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# నేటి బాలలే రేపటి పౌరులు..!!

– మెగా పీటీఎం 3.0 ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా నారాయణ రెడ్డి.








( ఆలూరు మనగళం ): ఆలూరు మండలంలోని ముద్దనగేరి గ్రామం నందు జిల్లా పరిషత్ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0 ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులు హాజరైన టీడీపీ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి. సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, విద్యార్ధులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు మరియు పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకొనిరావాలని, విద్యార్ధులకు సూశించారు. అనంతరం విద్యార్ధులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని అన్నారు. ఎంఈఓ చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, ముద్దనగేరి జిల్లా పరిషత్ స్కూల్ కు 4ఎకరాలు భూమిని దానంగా ఇవ్వడం, చాల సంతోషం అన్నారు. భూమి ఉన్నంతకాలం అయన చేసిన సేవలు, సమాజం గుర్చించుకుంటుంది అని తెలిపారు. నారాయణ రెడ్డి కు శాలవాలు కప్పి, సన్మానం చేసిన, ఎంఈఓ మరియు హెచ్ఎం, స్కూల్ ఉపాధ్యాయులు. విద్యార్ధుల తల్లిదండ్రులు పిల్లలను పనికి తీసుకువెళ్లకుండా బడికి పంపించి వారి భవిష్యత్తు బాగుపడేలా చూసుకోవాలని ఎంఈఓ చిరంజీవి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి హాజరైన దాదాపు 250 మందికి, ఓలిగిలు, భోజనం ఏర్పాటు చేసిన బి. మల్లికార్జున, పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు, స్కూల్ హెచ్ఎం పార్థసారథి మరియు పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, మురళి, సుధాకర్, టిడిపి నాయకులు, విద్యార్ధుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చలో విశాఖపట్నం జయప్రదం చేయండి. సిఐటియు

మనగలం :సున్నిపెంట శుక్రవారం రోజున సుండి పెంట గ్రామంలో. సి ఐ టి యు ఆఫీస్ లో సిఐటియు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి .సిఐటియు. శ్రీశైల మండలం అధ్యక్షుడు. దర్శనం నాగరాజు అధ్యక్షత వహించారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు.మునిపాటి చిన్న మారెన్న .యం.మల్లికార్జున మాట్లాడినారు .అనంతరం చల్లో. విశాఖ. గోడ పత్రిక ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో. సిఐటియు. మండల నాయకులు. కొదమల యోబు శ్రీశైలం హమాలీలు. నాగ వెంకటేష్. నాగేశ్వరరావు. హనుమంత్ రెడ్డి .సివిల్ సప్లై హామీలు. పవన్ కుమార్ రెడ్డి. ఆవులయ్య. రంగస్వామి. చిన్న వెంకట నారాయణ. చిన్న గంగులు. నారాయణ. భీమలింగడు .తెలుగు మల్లయ్య. ఫారెస్ట్ యూనియన్ నాయకులు గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేయు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.



## రామదుర్గం గ్రామంలో నూతన గ్రంథాలయం




మన గళండోన్ మండలంలోని బి.రామదుర్గం గ్రామంలో ప్రజలు, పూర్వ విద్యార్ధులు, దాతలు కలిసి నిర్మించిన గ్రామ గ్రంథాలయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. వడ్డూరి గిడ్డా రెడ్డి, భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి స్థలాన్ని ఉచితంగా ఇవ్వగా, నిర్మాణ వ్యయాన్ని ఇపిక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం అబయ్ గార్గ్, వినయ్‌కుమార్ మరియు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ భరించారు. ఇంజినీర్ రామాంజనేయుల చొరవతో రూపుదిద్దుకున్న ఈ గ్రంథాలయ ప్రారంభోత్సవంలో అతిథులకు గ్రామ ప్రవేశ ద్వారం వద్ద మేళాలు, బాణసంచా, పూలదండలతో ఘన స్వాగతం లభించింది. "చదువు ఇంటితోపాటు ఊరును మారుస్తుందని అతిథులు అన్నారుడ విద్యార్ధులు ఉద్యోగాలు సాధించి గ్రామం అభివృద్ధి చెందాలి" అని అబయ్, వినయ్ కుమార్ పేర్కొన్నారు. హిమజ లక్ష రూపాయల విలువ చేసే పుస్తకాలు అందిస్తామని తెలిపారు. యశోద హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సుంకన్న క్రమశిక్షణతో చదువుకున్నందుని మేము స్థాయి సాధించామని విద్యార్ధులకు ప్రేరణగా చెప్పారు. ఎంవీఓ ప్రభాకర్ రామదుర్గాన్ని డోన్ మండలంలో ఆదర్శ గ్రామమని అభివర్ణించారు. మాజీ సర్పంచ్ రామాంజనేయులు "చదువే అసలైన ఆయుధం" అని చెప్పారు. పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు సమిష్టిగా గ్రామాన్ని 'ఉద్యోగుల గ్రామం'గా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు.

## బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల మరియు జూనియర్ కళాశాల లో మెగా పేరెంట్స్ కార్యక్రమం

మన గళం, బనగానపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయసమావేశం గ్రావీ 3.0 లో కళాశాల మరియు పాఠశాల ఉపాధ్యాయుల ఆహ్వానమేరకు ఎస్ఐ కల్పన హాజరయ్యారు కార్యక్రమం లో ఎస్ఐ కల్పన మాట్లాడుతూ ఇటువంటి సమావేశాల వలన ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు మధ్యన మంచి స్నేహపూర్వక బంధం ఏర్పడి విద్యార్థి విద్యార్థునుల చదువు క్రమశిక్షణ పట్ల తల్లిదండ్రులకు మంచి అవగాహన నెలకొంటుంది అన్నారు ఇటువంటి సమావేశాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది అన్నారు కార్యక్రమం లో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## గోపూజతో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



మనగళం, మిద్దూరు: పరహితము పరమ ధర్మమని, అది హైందవ జీవన సారమని, అటువంటి హైందవధర్మాన్ని అందరూ తెలుసుకొని ఆచరించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ విచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాగలూటిలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మహిళలందరితో వేదపండితులు సురేశ్ శర్మ కుంకుమార్చనతో పాటు ముక్కోటి దేవతా స్వరూపమైన గోమాతకు పూజలు చేయించి, ఊరేగించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఊరందరికీ షడ్రుచోపేతమైన మహా ప్రసాదాన్ని అందించారు. మూడు రోజులు పాటు స్థానిక భజన మండలి చేసిన భజనలు, గరుడాద్రి వనజ కుమారి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సర్వేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ టి.ఉషారాణి, చిన్న పుల్లారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, నాగిరెడ్డి, బి. ఎల్లారెడ్డి, టి.వెంకట రమణారెడ్డి, టి. వెంకటరెడ్డి, బి. రమణారెడ్డి, నీలకంఠేశ్వరప్ప, రాంభూపాల్ రెడ్డి, చిన్న ఎల్లారెడ్డి, కట్టా నాగిరెడ్డి, బి. రవీంద్రారెడ్డి, కె.మల్లికార్జున్ రెడ్డి, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.శివశంకర్ రెడ్డి, టి.అబ్దుల్ కరీంతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



మనగళం, కల్లూరు అర్బన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం కర్నూలు శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగింది. కల్లూరు అర్బన్ 21వ వార్డు దీన్నే దేవరపాడు రోడ్డు లో ఉన్న శ్రీ సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. కూటమి సర్కార్ ధనార్జనే లక్ష్యంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేస్తుందని ఈ సందర్భంగా కాటసాని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో సంతకాలు చేయించారు. వైసీపీకి ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని కాటసాని కోరారు.

## ఎర్రగొండపాలెంలో శివా రెడ్డి ఘన సన్మానం




మనగళం : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఆర్&బి గెస్ట్‌హౌస్‌లో ఈ రోజు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, ఒంగోలు జిల్లా దీజీూ మాజీ అధ్యక్షులు ూ.ఎ. శివారెడ్డి గారు రాష్ట్ర లేబర్ బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.ఎర్రగొండపాలెం ుఱూ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు మరియు దీజీూ జిల్లా మాజీ అధ్యక్షులు పరస్పరం శాలువాలతో సత్కరించుకున్నారు. అనంతరం శివారెడ్డి గారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో దీజీూ జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసరెడ్డి, కోంద్రు పిచ్చయ్య, నర్సయ్య, మండలాధ్యక్షులు మాదాల సూర్యనారాయణ, పుల్లలచేరువు, త్రిపురాంతకం మండలాధ్యక్షులు, పెద్దారవీడు మండల మాజీ అధ్యక్షుడు కోటిరెడ్డి, బొచ్చు లక్ష్మిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమాన ఆలస్యం, రద్దులపై ప్రయాణికుల హక్కులు..

హైదరాబాద్ , డిసెంబర్ 5 , మన గళం, ఇటీవలి రోజుల్లో దేశవ్యాప్తంగా విమానాలు ఆలస్యం కావడం, చివరి నిమిషంలోనే రద్దు కావడం తరచుగా జరుగుతోంది. ఎయిర్‌పోర్ట్‌లలో గంటల తరబడి వేచి చూసి చివరికి విమానం రద్దైపోయిందని చెప్పడం వల్ల ప్రయాణికులు తీవ్రమైన అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఇండిగో వంటి పెద్ద ఎయిర్‌లైన్ సంస్థలు వరుసగా విమానాలను రద్దు చేయడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల హక్కులపై డీజీసీఏ స్పష్టమైన నిబంధనలు అమల్లో ఉంచింది. చాలా మందికి తెలియని ఈ హక్కులు విమాన ప్రయాణంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎంతో ఉపయోగపడతాయి.

# నిరుద్యోగ భృతి హామీ అంతేనా...



మనగళం, కల్లూరు అర్బన్ : ఎన్నికల ముందు కూటమి పెద్దలు యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ... అంతేనా అని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ ఎద్దేవా చేశారు. కాటసాని నివాసంలో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం యువతా మేలుకో కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన జరగబోయే యువత మేలుకో కార్యక్రమం సంబంధించిన పోస్టర్ ను కాటసాని శివనరసింహారెడ్డి, నాయకులతో కలిసి కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అయినా యువతకు నిరుద్యోగ భృతి పథకం అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. మాయ మాటలు చెప్పే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై యువత తిరగబడే రోజులు ఆసన్నమైందన్నారు. రైతులకు ఇవ్వాల్సిన ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ పంట గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ దౌర్జన్య అరాచక పాలనను ఎండగట్టేందుకు వైసీపీ నాయకులు కార్యకర్తలు నడుం బిగించారన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, యువజన విభాగం అధ్యక్షులు, నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించిన టీజీ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని రాజవిహార్ సెంటర్ సమీపంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో శివ, అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. టీజీ వెంకటేష్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శివ స్వాములు ,అయ్యప్ప మాల స్వాములతో పాటు సాధారణ భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయం అభివృద్ధి గురించి ఆలయ కమిటీ ప్రతినిధులతో టీజీ చర్చించారు .ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా నగరంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో క్రమం తప్పకుండా పూజలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి, తన తనయుడు టీజీ భరత్ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇక్కడ రూముల నిర్మాణం వంటి కార్యక్రమాలను నెరవేరుస్తామని వివరించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ ఆలయం అభివృద్ధికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సహాయ సహకారాలు అందించడం ఆనందంగా ఉందని చెప్పారు.

# ఘనంగా స్టాంటన్ జయంతి



మనగళం, కర్నూలు సిటీ : కోల్స్ చర్చ్, కోల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టాంటన్ 158 వ జయంతి ఘనంగా నిర్వహించారు. కోల్స్ కళాశాల ఆవరణలోని స్టాంటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టాంటన్ దొర చేసిన సేవలను ఈ సందర్భంగా కో ల్స్ చర్చ్ అధ్యక్షులు సోలోమోన్ గుర్తు చేశారు. కార్యక్రమంలో కోల్స్ చర్చి కార్యదర్శి అనిల్ నాథ్ , కోశాధికారి చార్లెస్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కోల్స్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయకుమార్, రమేష్ పాయి, కోల్స్ కళాశాల ప్రిన్సిపల్ నెహెమ్యా, ప్రధాన ఉపాధ్యాయులు రాజారావు, అధ్యాపకులు ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవితకు విద్య ఎంతో అవసరం.

– ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి.



( ఆలూరు మనగళం ):ఆలూరు మండల కేంద్రలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నంత బాలుర పాఠశాల-2లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి. సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వేసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టిఫిన్ బాక్సలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు ( 05.12.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన దమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి ఉయ్యాల సేవ



మనగళం శ్రీశైలం లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 05.12.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో ప్రాథమిక సమావేశం



మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 08వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. మహాశివరాత్రి పర్వదినం ఫిబ్రవరి 15తేదీన రానున్నది. 11 రోజులపాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించేందుకు ఈరోజు ( 05.12.2025) కార్యనిర్వహణాధికారివారు శ్రీ యం. శ్రీనివాసరావు, దేవస్థానం యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షకులు, మరియు వైదికకమిటీతో ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముందుగా గత సంవత్సరపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించబడింది. తరువాత కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాయంత్రాంగం, ధర్మకర్తల మండలి సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది అందరు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్క ఉద్యోగి కూడా భక్తుల సౌకర్యాల పట్ల పూర్తి శ్రద్ధవహించాలన్నారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాల వారిని ఆదేశించారు. అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఆయా విభాగాలపరంగా చేపట్టాల్సిన చర్యలకు తగు ముందస్తున్న ప్రణాళికలను (యాక్షన్ ప్లాన్) రూపొందించాలన్నారు. ఏర్పాట్లలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లకు సిద్ధం కావాలన్నారు. గత సంవతర్సరం కంటే కూడా ఈ సంవత్సరం భక్తులరద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకే అన్నీ ఏర్పాట్లు కూడా గత సంవత్సరం కంటే కూడా అధికస్థాయిలో చేయాలన్నారు. ముఖ్యంగా గత సంవత్సరం కంటే కూడా ప్రతీచోటకూడా అవకాశం మేరకు 20శాతం నుంచి 30శాతం దాకా అదనపు ఏర్పాట్లు ఉండాలన్నారు. బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8వ తేదీ ప్రారంభమవుతున్నప్పటికీ, ముందస్తుగానే భక్తులు క్షేత్రానికి చేరుకుంటారని చెబుతూ అన్ని ఏర్పాట్లు కూడా ముందస్తుగా పూర్తికావడం తప్పనిసరి అన్నారు. ఏర్పాట్లన్నీ కూడా జనవరి మాసం చివరిలోగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. దేవస్థానం ఉద్యోగులందరు కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. దేవస్థానం అన్ని విభాగాలు కూడా సమిష్టిగా పరస్పర సమన్వయంతో ఉత్సవ నిర్వహణలో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం కార్యనిర్వహణాధికారివారు విభాగాల వారీగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను గురించి కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాధిపతులకు, పర్యవేక్షకులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వైదిక సిబ్బంది మరియు ఆలయ విభాగాధికారులు పరస్పర సమన్వయంతో ఉత్సవాలలో జరిగే ఆయా కైంకర్యాలన్నీ ఎలాంటిలోటు లేకుండా సంప్రదాయబద్ధంగా జరిపించాలన్నారు. ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆలయవిభాగానికి సూచించారు. తరువాత ఉత్సవాలలో నిర్వహించాల్సిన ఆయా వైదిక కార్యక్రమాలు, వాహనసేవలు, స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ, ఉత్సవాల సమయములో ఆలయ వేళలు, దర్శనం ఏర్పాట్లు మొదలైన వాటి గురించి చర్చించారు. ఉత్సవాల యందు ఆయా కైంకర్యాలలో సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. అదేవిధంగా మహాశివరాత్రి రోజైన ఫిబ్రవరి 15న జరిగే ప్రభోత్సవం, పాగాలంకరణ, బ్రహ్మోత్సవ కల్యాణం, ఆ మరునాడు జరిగే రథోత్సవం తదితర కార్యక్రమాలకు సంబంధించి తగు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. అనంతరం పాదయాత్రతో వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మొదలైన చోట్ల చేయవలసిన ఏర్పాట్ల గురించి చర్చించారు. అటవీశాఖ వారి సహకారముతో నడకదారిలో వచ్చే భక్తులకు ఆయా ఏర్పాట్లను కల్పించాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ముఖ్యంగా శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు, జ్యోతిర్ముడి సమర్పణకు చేయాల్సిన ఏర్పాట్లు మొదలైనవాటి గురించి పలు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మహాశివరాత్రికి వచ్చే భక్తులు సేదతీరేందుకు ఆరుబయలు ప్రదేశాలలో పైప్ పెండాల్స్, షామియానాలు మొదలైన వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వీటివద్ద తగినంత విద్యుద్దీపాల ఏర్పాటు ఉండాలన్నారు. అదేవిధంగా తగినన్నీ శౌచాలయాలు ఉండాలన్నారు. క్యూకాంప్లెక్స్ నందు మరియు క్యూలైన్ల యందు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దర్శనానికి వేచివుండే భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం మొదలైన వాటిని అందజేస్తుండాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమై ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. క్యూలైన్లన్నీ ధృడంగా ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ప్రజాసౌకర్యాలకు (మూత్రశాలలు మరియు మరుగుదొడ్లు) అవసరమైన అన్ని మరమ్మతులు చేయించి అన్నింటిని కూడా వినియోగంలోకి వచ్చేవిధంగా తగు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ్య విభాగపు అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిధిలో అవసరమైన చోట్ల అదనపు కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు.



స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా క్షేత్రపరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలన్నారు. గతంలో వలనే క్షేత్రపరిధిని జోన్లుగా, సెక్టార్లుగా విభజించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేవిధంగా పారిశుద్ధ్య ఏర్పాట్లు ఉండాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు, సామానులు భద్రపర్చుగది, ట్రాఫిక్ నియంత్రణ మొదలైన అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మరియు భద్రతా విభాగం ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. గత సంవత్సరం కంటే కూడా ఈ సారి అదనపు ప్రదేశాలలో కూడా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగు ప్రదేశాల వివరాలు స్పష్టంగా తెలిసేవిధంగా సూచికబోర్డులను అధికసంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలలో ట్రాఫిక్ నిలచిపోవడంలాంటి అంతరాయాలు లేకుండా ఉండేందుకు తగు ముందస్తు చర్యలు చేపట్టాలని భద్రతావిభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌శాఖవారితో తగు సమన్వయ చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించారు. ఉత్సవసమయాలలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి రికవరీ వాహనం, టోయింగ్ వాహనాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా పాతాళగంగలో కూడా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ముఖ్యంగా పాతాళగంగలో సేఫ్టీ మెష్ (రక్షణ కంచె), పాతాళగంగలో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన గదుల ఏర్పాటు పాతాళగంగమెట్లమార్గములో అవసరమైన మరమ్మతులు మొదలైనవాటిపట్ల శ్రద్ధ కనబర్చాలన్నారు. భక్తులరద్దీకి తగినట్లుగా అన్నప్రసాదవితరణ ఏర్పాట్లు ఉండాలన్నారు. క్షేత్రపరిధిలో అన్నదానం చేసే స్వచ్ఛందసేవాసంస్థలకు దేవస్థానం పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఉత్సవాలలో పండుగ వాతావరణం ఉండేవిధంగా విద్యుద్దీపాలంకరణ ఉండాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ఆరుబయలు ప్రదేశాలలో తగినంతగా విద్యుద్దీపాల ఏర్పాటు ఉండాలన్నారు. ఉత్సవాలలో పుష్పాలంకరణను సంప్రదాయబద్ధంగా మరియు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఉద్యానవన అధికారిని ఆదేశించారు. భక్తులను అలరించేందుకు ధార్మిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల విభాగాన్ని ఆదేశించారు. వేదసంస్కృతి, సనాతనధర్మంపై అవగాహన కలిగించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

# హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంకు సేవలు అభినందనీయం

**– మాజీ రాజ్యసభ సభ్యులు వెంకటేష్**





మనగళం, కర్నూలు సిటీ : హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంకు ప్రతినిధులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందించదగ్గవని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక మౌర్య ఇన్ కాంప్లెక్స్ నందు ఉన్న హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంకు ఆవరణంలో బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంకు స్థాపించిన అనతి కాలంలోనే బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందిందన్నారు. తక్కువ వడ్డీ రేటుతో సులభంగా రుణాలు మంజూరు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 1200 బ్యాంకు బ్రాంచీలలో ఇటువంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాకపోయినప్పటికీ దాన్నిహెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంక్ యాజమాన్యం, సిబ్బంది సుసాధ్యం చేసి చూపించారన్నారు. ఇప్పటికే 50 లక్షల పైగా ఖాతాదారులు ఉన్నటువంటి హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంక్ మరింత అభివృద్ధి చెదడంతోపాటు ప్రజల కొరకు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని కోరుకుంటున్నానని టీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.డీ.ఎఫ్.సీ బ్యాంక్ సిబ్బంది నున్న కుమార్, సతీష్, మహమ్మద్ గౌస్, విజయమోహన్ రెడ్డి, శశాంక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన తిక్కారెడ్డి



మనగళం, కర్నూలు సిటీ : సీఎం చంద్రబాబు నాయుడిని కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితిని తిక్కారెడ్డి.... సీఎంకు వివరించారు. ముఖ్యంగా ఆదోని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని స్థానిక నాయకులు ఆందోళనలు చేపట్టిన విషయాన్ని సీఎంకు తెలిపారు. ఈ విషయము ఇప్పటివరకు నా దృష్టికి ఎవ్వరూ తీసుకొని రాలేదని సీఎం అన్నట్లు తిక్కారెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు హామీ ఏమైనా ఇచ్చామా అని కూడా ఆరా తీశారన్నారు. ఎన్నికలకు ముందు ఇలాంటి డిమాండ్ ఆదోని ప్రాంతంలో రాలేదని చెప్పామన్నారు. జిల్లా మంత్రితోపాటు జిల్లాఇన్చార్జి మంత్రి, తదితర ప్రముఖ నాయకులు చర్చించుకుని తనను కలువాలని సీఎం చెప్పినట్లు తిక్కారెడ్డి తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మంత్రాలయం నియోజకవర్గం నాయకులు చిన్న బసప్ప ఉన్నారు.ఋ

# పార్క్ భూముల రక్షణకు కఠిన చర్యలు

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని పార్క్ స్థలాలను అక్రమంగా కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని పార్కు స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కు స్థలాలుగా గుర్తించిన ఈ భూమిపై ఎటువంటి నిర్మాణాలు, గోతులు, కొనుగోలు, అమ్మకాలు లేదా వ్యక్తిగత వినియోగాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి అక్రమ మార్పిడి, అమ్మకాల గురించి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్క్ స్థలాలు ప్రజల శ్రేయస్సుకు, పర్యావరణ భద్రతకు అత్యంత అవసరమని, వాటిని రక్షించడం కార్పొరేషన్ బాధ్యత అని కమిషనర్ తెలిపారు. పార్క్ భూములపై పర్యవేక్షణను మరింతగా పెంచి, అక్రమ కార్యకలాపాల్లో పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# పారిశుద్ధ కార్మికులకు జీతాలు చెల్లించేలా కృషి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**– ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసిన పారిశుద్ధ కార్మికులు**

మనగలం :సున్నిపెంట : శ్రీశైలం నియోజకవర్గం లో సుండి పెంట గ్రామంలో పారిశుద్ధ కార్మికులు దాదాపు 30 మంది కి గత తొమ్మిది నెలలుగా జీతాలు రాకపోవడంతో టి యు సి ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై ఆశీర్వాదం నంద్యాల జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్మికుల జీతాలు విషయాన్ని వారికి వివరించగా స్పందించిన వారు. సుండుపెంట గ్రామానికి నిధులు లేనప్పటికీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి. అధికారులను దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లికార్మికులకు చెల్లించాల్సిందిఇది మిన్నెల్లో జీతాలుచెల్లించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ సు0డిపంట పరిశుద్ధ కార్మికులు రోజువారి కూలీలాగా పనిచేస్తున్నారని పరిశుద్ధ కార్మికులను కనీసం వారికి బియ్యపు ఈపీఎఫ్ ఆరోగ్య పని పదులుతుంది లేదని. ఈ వర్తించలా చూడాలని. సకాలంలో జీతాలు చెల్లించి. ఉన్న జనాభా ప్రకారంఅదనంగా పరిశుద్ధ కార్మికులను పెంచాలని. వారిని కోరుతూ పారిశుధ్య కార్మికుల జీతాలు కోసం కృషి చేసినటువంటి ఎంపీడీవో జిల్లా ఉన్నత అధికారులకు నియోజవర్గ ఇన్చార్జి కి కార్మికుల తరఫున ధన్యవాదాలు తెలియజేయడమే ఈ కార్యక్రమంలో



పారిశుధ్య కార్మికులు పాపయ్య శివ మస్తాన్ యోహాను పుల్లయ్య ఎల్లప్ప. మరియమ్మ కుమారి మేరీ లక్ష్మి ఎలిశమ్మతదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు అందిస్తున్న సేవలలో సంతృప్తి పెరగాలి

**– జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి ఐవిఆర్ఎస్ ద్వారా తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ లో సంతృప్తి స్థాయి శాతం తప్పనిసరిగా పెరగాలని, అలాగే ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించి పరిష్కారం చేసే సమయంలో ప్రతి అర్జీదారునితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి హౌసింగ్, రెవెన్యూ సేవలు, ఐవీఆర్ఎస్, దేవాదాయ%-%వక్ఫ్ ఆస్తులు తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఎస్ డీటీ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజల అర్జీల పరిష్కారానికి సంబంధించి రికార్డు కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఐవీఆర్ ఎస్ కాల్స్ ద్వారా ఫీడ్‌బ్యాక్ పరిశీలించినప్పుడు సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్నట్టు గుర్తించామని, పెరిగే విధంగా రెవెన్యూ అధికారులు పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మ్యూటేషన్ నోటీసులు రైతులకు ఇవ్వకపోవడం, డబ్బు అడిగారనే విషయంపై వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లపై వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి, వాస్తవమైతే కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆదోని, ఆలూరు, ఆస్పరి, సి.బెలగల్ మండలాల్లో రెవెన్యూ సేవలకు సంబంధించి నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ అధికంగా ఉందని, ఈ మండలాల్లో అధికారులు పనితీరు మార్చుకుని, ప్రజలకు మంచి సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సరిహద్దు మండలాలు హొళగుంద, కౌతాళం, కోసిగి ప్రాంతాల్లో అధికారులు కార్యాలయానికి సమయానికి హాజరు కావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రతి అధికారి ఉదయం 10 గంటల లోపు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ-పీటీఎస్ పోర్టల్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, రెవెన్యూ సేవలను పూర్తిగా పారదర్శకంగా అందించాలని సూచించారు. క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజా సేవ ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని ప్రతి శాఖ సమర్థతను పెంచి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని పరిహారం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ౕ% పరిహారం కేసుల నివేదికలు ఆలస్యంతో పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి కేసును అత్యవసరంగా పరిగణించి, నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కల్లూరు మండల పరిధిలో మొత్తం 9 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించిన విచారణ నివేదికలను వారం రోజుల్లోపు పూర్తిచేసి సమర్పించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గోనెగండ్ల మండలంలో మొత్తం 3 కేసులు ఉండగా, అందులో 2 కేసుల నివేదికలు ఇప్పటికే అందినట్లు వెల్లడించారు. మిగిలిన ఒక కేసు నివేదికను తక్షణం పంపించాలని తహసీల్దార్ ను ఆదేశించారు. డాటెడ్ ల్యాండ్స్ వివరాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యుటేషన్ అర్జీలు గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 22 ఏ కు సంబంధించి నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీ ఆర్వో వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి

**– 10 వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు**

మనగళం, ఎమ్మిగనూరు : ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని జిల్లా సాధన విద్యార్థి జేఏసీ కన్వీనర్ శేఖర్ నాయుడు, ఉదయ్, ఆదోని సాధన సమితి నాయకులు బతకన్న డిమాండ్ చేశారు. విద్యార్థి యువజన ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 10వ తారీకు నుండి ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్ కూడలి నందు విద్యార్థి యువజన ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని ని జిల్లాగా ప్రకటిస్తే పశ్చిమ ప్రాంతంలో ఉండే ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండి విద్య, వైద్యం, సాగు, తాగునీరు, పరిశ్రమలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రిలే నిరాహార దీక్షలకు విద్యార్థులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు ,మేధావులు మద్దతు ప్రకటించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ కో కన్వీనర్ కృష్ణ, రఘు, కాజా ,ఆఫ్రిద్, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలి

మనగళం, నంద్యాల : ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేషన్ తప్పక చేయించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాస్థాయి ఆధార్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ.... ఆధార్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తి తప్పనిసరిగా తమ ఆధార్ అప్డేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్ అప్డేషన్ కార్యక్రమాలు ఆధార్ నమొదు కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుంది. 5 నుంచి15 సంవత్సరాలు దాటిన పిల్లలు తమ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యాసంస్థల్లో ప్రవేశం, బ్యాంకుల్లో ఖాతాలు తదితర అవసరాలకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం బిడ్డపుట్టిన వెంటనే శిశుకు కూడా ఆధార్ కార్డు ఇచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ప్రతి శిశువుకు ఆధార్ నమోదు చేయించడంతో పాటు.. ఐదేళ్లు పూర్తయిన వెంటనే.. బయోమెట్రిక్ నమోదు చేయించాలని.. ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పుట్టిన ప్రతి శిశువుకు "శిశు ఆఫ్" ద్వారా తల్లిదండ్రుల ఆధార్ వివరాల ఆధారంగా తప్పనిసరిగా ఆధార్ నెంబర్ నమోదు చేయాలని.. 5 సంవత్సరాల 4 నెలలు పూర్తి అయిన తర్వాత పిల్లల ఫింగర్ ప్రింట్ తో బయోమెట్రిక్ సీడింగ్ చేయించాలన్నారు. ఈ ప్రక్రియను వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో చేపట్టాలన్నారు.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.